# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం 21 మే 2025 www.prajaswaramdaily.com




## ప్రభుత్వ ఆసుపత్రిలో జడ్జి ప్రసవం

**మంత్రి ..అభినందనలు**

**ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశామని వెల్లడి**

వేములవాడ: వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా జడ్జి జ్యోతిర్మయి సోమవారం పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. సాధారణ కాన్పు ద్వారా మగబిడ్డ జన్మించాడని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయమూర్తి స్వయంగా ఇక్కడ సేవలు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు పొంది అందరికీ ఆదర్శంగా నిలిచారని సీనియర్ కోర్టు ఏజీపీ ప్రశాంత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తి జ్యోతిర్మయి వేములవాడ జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు.
2023లోనూ ఇదే ఆసుపత్రిలో ఆమె ఆడ పిల్లకు జన్మనివ్వడం విశేషం. ఈ విషయం తెలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎక్స్ ద్వారా న్యాయమూర్తి కి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు అందుబాటులో ఉంటారని, వారి సేవలు పొందాలని ప్రజలకు సూచించారు. ప్రజాప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేశామని పేర్కొన్నారు.



## గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదంపై కమిటీ

**ఆరుగురు ఉన్నతాధికారులతో ఏర్పాటు**

**భవిష్యత్‌లో ప్రమాదాలు నివారించేందుకు నివేదికలు, సూచనలు**




హైదరాబాద్ : గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆరుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, ప్రభుత్వ చర్యలపై స్పష్టతనిచ్చారు. ఈ విచారణ కమిటీకి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సీవీ ఆనంద్, ఫైర్ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, విద్యుత్ పంపిణీ సంస్థ టీఎస్ ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ వంటి కీలక పదవులలో ఉన్న అధికారులను నియమించారు. ఈ కమిటీ బాధ్యత, గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం జరిగిన కారణాలు, ఘటన అనంతరం తీసుకున్న చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయడం.
కేవలం కారణాలపై నివేదిక తయారు చేయడమే కాకుండా, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి, క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు చేయాలి వంటి విషయాలపై కమిటీ స్పష్టమైన ప్రతిపాదనలు సమర్పించనుంది. ఘటనపై నివేదిక అందిన అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటారని మంత్రి పొన్నం వెల్లడించారు. ప్రజల ప్రాణాలు విలువైనవని, భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలపై సున్నితంగా స్పందించడమే కాకుండా, తక్షణమే పరిష్కార మార్గాలు అన్వేషించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ కమిటీ ఏర్పాటు ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

## తగ్గనున్న మెట్రో ఛార్జీలు!

**ప్రయాణికులకు కాస్త ఊరట**

**ఇటీవల పెంచిన రేట్లపై 10 శాతం తగ్గింపు**

**మే 24 నుంచి అమల్లోకి**

హైదరాబాద్ : మెట్రో ప్రయాణికులకు ఊరట కలిగింది. ఇటీవల పెంచిన ప్రయాణ ఛార్జీల విషయంలో హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం పునరాలోచన చేసి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల పెంచిన మెట్రో ఛార్జీలను సవరిస్తూ, వాటిని 10 శాతం మేర తగ్గిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం వెల్లడించింది. ఈ నిర్ణయంతో ప్రయాణికులపై ఆర్థిక భారం కొంతమేర తగ్గనుంది. ఇటీవల ఛార్జీల పెంపుపై ప్రయాణికుల నుంచి వ్యక్తమైన అభ్యంతరాల నేపథ్యంలో ఈ సవరణ చేసినట్లు తెలుస్తోంది. కొత్త ఛార్జీలు ఈ నెల 24వ తేదీ నుంచి వర్తిస్తాయని స్పష్టం చేసింది. నగరంలో రోజూ మెట్రో సేవలను వినియోగించుకునే వేలాది మందికి ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుంది. ఈ నెల 17వ తేదీ నుంచి పెరిగిన మెట్రో ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. కనీస ఛార్జీ రూ. 10 నుంచి రూ. 12కు, గరిష్ఠ టికెట్ ధర రూ. 60 నుంచి రూ. 75కు పెంచారు. ఇలా కనిష్ఠంగా రూ.2, గరిష్ఠంగా రూ.16 వరకు ఛార్జీలు పెంచినట్లు ఎల్ అండ్ టీ ప్రకటించింది. అయితే ఈ పెరిగిన ధరలో 10 శాతాన్ని తగ్గించాలని హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం నిర్ణయించింది.



# కేసీఆర్, హరీశ్, ఈటలకు నోటీసులు

**కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి....**

**వాటిని జారీ చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్**

**వివరణ ఇచ్చేందుకు 15 రోజుల గడువు**

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. కేసీఆర్‌తో పాటు, ఆయన ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన హరీశ్ రావు, బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు పంపింది.

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఈ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశించింది.



ఇందుకోసం నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు చేసింది.

కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ తన నోటీసులో స్పష్టం చేసింది. అలాగే, కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు జూన్ 6వ తేదీన, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ పేర్కొంది.
మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరానికి తగిన విధంగా కమిషన్ గడువును ఏడుమార్లు పొడిగించింది.




## రాజ్‌భవన్‌లో చోరీ

**కీలక డేటా అపహరణపై కలకలం**

**హెల్మెట్‌తో వచ్చిన దొంగ**

**అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా గుర్తింపు, అరెస్ట్**

**కీలక హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం**

హైదరాబాద్ : రాజ్‌భవన్‌లో దొంగతనం జరిగింది. హర్డ్ డిస్కులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన 14 వే తేదీ రాత్రి జరిగింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన సుధర్మ భవన్‌లోని కంప్యూటర్ గది.. మొదటి అంతస్తులో ఉండగా, దీనిలోకి హెల్మెట్ ధరించి ప్రవేశించిన వ్యక్తి కనిపించాడు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన భద్రతా సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటి నుండి కేసు విచారణ ప్రారంభించి, నిందితుడిని గుర్తించేందుకు స్పెషల్ టీమ్ రంగంలోకి దిగింది. చోరీలో రాజ్‌భవన్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తినే నిందితుడిగా పోలీసులు నిర్ధారించారు. అతను భద్రతా వ్యవస్థలపై అవగాహనతో, సమయాన్ని ఎంచుకుని హర్డ్‌డిస్క్‌లను అపహరించాడు. అతనిని అరెస్ట్ చేసిన పంజాగుట్ట పోలీసులు, చోరీ చేసిన హర్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. అపహరించబడిన హర్డ్‌డిస్క్‌ల్లో రాజ్‌భవన్‌కు సంబంధించిన వ్యవహారాలు, ప్రత్యేక రిపోర్టులు, ఫైళ్లతో పాటు కీలక సమాచారం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, పోలీసులు వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం తప్పిందని భావిస్తున్నారు.

## సీనియర్ నటుడిపై రూ.25 కోట్లకు దావా ?

**'హేరా ఫేరి 3' నుంచి వైదొలగిన పరేష్ రావల్**

**అక్షయ్ కుమార్ నిర్మాణ సంస్థ నుంచి రూ.25 కోట్ల లీగల్ నోటీసు**

**ఒప్పందం ఉల్లంఘించారని, వృత్తివిరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపణ**

**షూటింగ్ మొదలయ్యాక తప్పుకోవడంపై నిర్మాణ సంస్థ ఆగ్రహం**

**సృజనాత్మక విభేదాలు లేవన్న పరేష్**

ముంబయి : 'హేరా ఫేరి 3' మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాలో బాబురావు అనే మర్చిపోలేని పాత్రను పోషించిన ప్రముఖ నటుడు పరేష్ రావల్, తాను ఇకపై ఈ ప్రాజెక్టులో భాగం కానని గత వారం ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా ఈ వ్యవహారం చట్టపరమైన మలుపు తీసుకుంది. అక్షయ్ కుమార్ నిర్మాణ సంస్థ 'కేప్ ఆఫ్ గుడ్ ఫిల్మ్స్', పరేష్ రావల్‌కు రూ.25 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు పంపినట్లు హిందుస్థాన్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఒప్పందంపై సంతకం చేసి, సినిమా చిత్రీకరణ కూడా ప్రారంభమైన తర్వాత పరేష్ రావల్ వృత్తివిరుద్ధంగా ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారని నిర్మాణ సంస్థ ఆరోపిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రావల్‌కు అతని సాధారణ పారితోషికం కంటే మూడు రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నట్లు కూడా ఆ కథనంలో పేర్కొన్నారు. "పరేష్ వృత్తిపరమైన నైతికతను, వ్యాపార ప్రవర్తనను విస్మరించారు. సినిమా పూర్తి చేయాలనే ఉద్దేశం లేకపోతే, ఒప్పందంపై సంతకం చేయడానికి ముందే, అడ్వాన్స్ తీసుకునే ముందే, నిర్మాత భారీగా పెట్టుబడి పెట్టేలా చేయడానికి ముందే చెప్పి ఉండాల్సింది" అని నిర్మాణ సంస్థ వర్గాలు తెలిపినట్లు సమాచారం. "హాలీవుడ్‌లో లాగే, ఇక్కడ కూడా నిర్మాతలు నటీనటులు ఒప్పందాలను ఉల్లంఘించి, ఇష్టానుసారం ప్రాజెక్టుల నుంచి వైదొలగడాన్ని సహించరని బాలీవుడ్ నటులు అర్థం చేసుకోవాల్సిన సమయం ఇది" అని కూడా ఆ కథనంలో పేర్కొన్నారు.

### సృజనాత్మక విభేదాలు లేవు

పరేష్ రావల్ సినిమా నుంచి తప్పుకోవడానికి సృజనాత్మక విభేదాలు లేదా ఆర్థిక సమస్యలే కారణమని పుకార్లు వ్యాపించాయి. "హేరా ఫేరి 3 నుంచి వైదొలగాలన్న నా నిర్ణయానికి సృజనాత్మక విభేదాలు కారణం కాదని స్పష్టం చేయాలనుకుంటున్నాను. చిత్ర దర్శకుడు ప్రియదర్శన్‌పై నాకు అపారమైన ప్రేమ, గౌరవం, విశ్వాసం ఉన్నాయి. ఆయనతో ఎలాంటి సృజనాత్మక విభేదాలు లేవని మరోసారి నొక్కి చెబుతున్నాను" అని ఆయన తెలిపారు.

